క్లుప్తంగా

స్వచ్ఛమైన పల్లెలను ఆవిష్కరిద్దాం



కొరిపల్లిలో ఓ ఇంటి వద్ద నిల్వ నీటిని పారబోయిస్తున్న సిబ్బంది

కరప: స్వచ్ఛమైన పల్లెలను ఆవిష్కరించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. కొరిపల్లి, గురజనాపల్లి, గొర్రిపూడి, కరప తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి గ్రామ కార్యదర్శులకు డ్రై డే గురించి వివరించి, అమలు చేయాలన్నారు. గ్రామాల్లోని తాగునీటి పథక ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. గ్రామ కార్యదర్శులు, వైద్య, ఆశ సిబ్బందితో కలసి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిల్వ నీటి కారణంగా పెరిగే దోమల వ్యాప్తి గురించి తెలపాలన్నారు. తద్వారా డెంగీ, గన్యా, మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. కార్యదర్శులు పి.ఉమామహేశ్వరి, బి.చంద్రకళ, ఎస్కే నాగేంద్రకుమార్, కె.శ్రీనివాస్, సచివాలయ అసిస్టెంట్లు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

కంచిరాజు సేవలు చిరస్మరణీయం



మాజీ సర్పంచ్ కంచిరాజు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

కరప: రాజకీయాలకతీతంగా ప్రజా సేవచేసిన మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చాగంటి సత్యవరద కంచిరాజు చిరస్మరణీయుడని పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు అన్నారు. కరపలో శుక్రవారం కంచిరాజు వర్ధంతిని శివగంగ రజక సంఘం నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో కంచిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, శివాలయ కమిటీ మాజీ చైర్మన్లు చొల్లంగి దుర్గారావు, గొర్రెల శ్రీనివాస్, సంఘ సభ్యులు కాకినాడ ఈశ్వరరావు, మంచాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయం ప్రారంభం



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

బోట్‌క్లబ్: కాకినాడ రామారావుపేటలో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పార్టీ అవసరాల నిమిత్తం కార్యాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని దేశంలోని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారన్నారు. అనంతరం స్థానిక కాపు కల్యాణ మండపంలో జరిగిన బీజేపీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్టీ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టి సత్యనారాయణ, నాయకులు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, బిక్కిన విశ్వేశ్వరరావు, కవికొండల భీమశంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

కరప: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 17వ రోజుకు చేరుకుంది. కరపలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన శిబిరానికి మండల టీడీపీ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, నాయకుడు కటకంశెట్టి ప్రభాకర్ వెళ్లి మద్దతు తెలిపారు.

కొనసాగిన సమ్మె

కాకినాడ సిటీ: స్థానికంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు పది రోజులుగా చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.చంటిబాబు సత్యనాగమణి, పీవీవీ మహాలక్ష్మి, ఎ.లోవరాజు, జి.నారాయణ, శ్రీనివాస్, పి.రాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



దివ్యాంగుడికి ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: పేదల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏఎంజీ స్కూల్ ఆవరణలో కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆరోగ్యశ్రీపై ప్రస్తుతం ఉన్న ఆదాయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు ఈ కొత్త కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేదలు ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం బాధపడకూడదనే ఏకైక లక్ష్యంతో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆయన తనయుడు సీఎం జగన్ మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కరోనాకు సైతం వైద్యాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కాకినాడలో 94 వేల కుటుంబాలు ఉంటే 74 వేల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయన్నారు. విద్య, వైద్యం, సొంతింటి కల సాకారం ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలని అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3,257 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరనాయక్ మాట్లాడుతూ కొత్తగా అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులతో ఇతర రాష్ట్రాలలో కూడా వైద్య సేవలు పొందే వెసులుబాటు ఉందన్నారు. ఆరోగ్యశ్రీని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ అకౌంట్‌తో అనుసంధానం చేశారన్నారు. గుండె, క్యాన్సర్, కిడ్నీతో సహా ముఖ్యమైన వ్యాధులకు కూడా ఈ కార్డుల ద్వారా ఏడాదికి రూ.25 లక్షల పరిమితి వరకూ వైద్య సేవలు పొందవచ్చన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగి తిరిగి కోలుకునేంత వరకూ ఆసరా పేరుతో ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్క కాకినాడ సిటీ నియోజకవర్గం పరిధిలోనే ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు రూ.102 కోట్ల విలువైన సేవలను అందించామన్నారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను ఎమ్మెల్యే ద్వారంపూడి, అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నకుమార్, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, పలువురు మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం



రమణయ్యపేటలో సామాజిక భవన పనులు ప్రారంభిస్తున్న కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అసంపూర్తి సామాజిక భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఏపీఐఐసీ కాలనీలో ఆయన పర్యటించి సామాజిక భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. నెల రోజుల్లో భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, గగారిన్, కృష్ణంరాజు, రెడ్నం రాజా, కడియాల చిన్నా, సత్తి చిన్నారి, ఏఈ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడబాల ట్రస్ట్ కార్యాలయాన్ని కురసాల సత్యనారాయణ సందర్శించి ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ సేవలను అభినందించారు.

తైక్వాండో పోటీలకు రాష్ట్ర జట్టు పయనం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మధ్యప్రదేశ్‌లో జనవరి 1 నుంచి 3 వరకూ జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీలకు రాష్ట్ర జట్టు శుక్రవారం పయనమైందని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. అండర్–14, 17, 19 విభాగాల్లో దినకర్, వీరనరసింహమూర్తి, వశిష్ఠ, హర్షవర్ధన్, ధనుష్‌తేజ, పర్ణిక తదితరులు పోటీల్లో పాల్గొంటున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాకినాడ: స్థానిక జగన్నాథపురం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్లపై పడిన చెట్టుకొమ్మలను తొలగించేందుకు సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. నరసింహారోడ్డు ఫీడర్ పరిధిలోని ఏసువారివీధి, చినమార్కెట్ వీధి, విష్ణాలయం వీధి, గుడిమెట్లవారి వీధి, మామిడిపల్లివారి వీధి, ఆకాశపువారి వీధి, జగన్నాథపురం పాత వంతెన వేంకటేశ్వరస్వామి గుడి ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే చొల్లంగి ఫీడర్ పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట, తుపాన్ బిల్డింగ్, పోర్టుకాలనీ, గోపాలకృష్ణ నగర్ ప్రాంతాల్లో కూడా ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు



గురజనాపల్లిలో రహదారి అభివృద్ధికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: కరప, కాకినాడ రూరల్ మండలాల్లో రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధిక శాతం నిధులు కేటాయిస్తున్నారని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని గురజనాపల్లి నుంచి శివారు అడవిపూడికి వెళ్లే రహదారి నిర్మాణానికి ఆమె స్థానిక నాయకులతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గురజనాపల్లి నుంచి అడవిపూడి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే స్పందించి ఉపాధి హామీ పథకం నిధులు రూ.60 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, పబ్బినీడి పాపారావు, జొన్నలగడ్డ కృష్ణమూర్తి, చొల్లంగి దుర్గారావు, గ్రామ కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ.. ఇదేం తీరు!

- భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాజకీయం
- ప్రతిఘటించిన భక్తజనం



కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఇరువర్గాల వాగ్వాదం

కాకినాడ: 'ఎన్టీఆర్' విగ్రహాన్ని అడ్డుపెట్టుకుని భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీడీపీ వ్యవహరించడంతో ఆ పార్టీ శుక్రవారం కాకినాడలో అభాసుపాలైంది. ఓ వైపు భక్తులు భజనలు చేస్తోంటే, ఆలయం వైపు టీడీపీ కేడర్‌తో మోహరించి అరుపులు, కేకలు, ఈలలు వేస్తూ రోడ్డుపై బైఠాయించడంతో భక్తుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ సంతచెరువు వద్ద కనకదుర్గమ్మ ఆలయాన్ని రూ.2 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయం ఆవరణలో రాజగోపురానికి అడ్డుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని మూడు మీటర్లు పక్కకు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రదక్షిణలకు అవరోధంగా ఉండటంతో భక్తుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఇతర నేతలు ఆలయం వద్దకు చేరుకుని విగ్రహాన్ని పక్కకు జరిపే ప్రక్రియకు అడ్డుతగిలారు. విగ్రహాన్ని తొలగించే ఉద్దేశం లేదని, పక్కకు మాత్రమే జరుపుతున్నామని ఆలయ ప్రధాన దాత, అభివృద్ధి కమిటీ చైర్మన్ జొన్నాడ చినబాబు, మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్, యువ నాయకులు గణపతి, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు తదితరులు టీడీపీ నేతలకు స్పష్టం చేశారు. అయితే ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుని లబ్ధి పొందాలని అక్కడకు వచ్చిన టీడీపీ నాయకులు పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఆలయం పక్కనే ధర్నా చేసి విగ్రహం జరిపే ప్రక్రియను అడ్డుకున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కూడా అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య అరుపులు కేకలు, వాగ్వాదాలతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పారు. అయితే అదే సమయంలో ఆలయం వద్ద భక్తులు ఓ వైపు భజనలు చేస్తుండగా, వారికి ఆటంకం కలిగించేలా వ్యవహరిస్తూ ఆలయం వెలుపల టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈలలు, కేకలు వేస్తూ రసాభాస చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతినేలా టీడీపీ కేడర్ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. భక్తులు కూడా టీడీపీ తీరును నిరసిస్తూ ఎదురు తిరగడంతో చివరకు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

టీడీపీది కపట ప్రేమ: ద్వారంపూడి

కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ ఎన్టీఆర్‌పై కపట ప్రేమ చూపించిందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. ఈ వివాదంపై ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్ల వద్ద స్పందిస్తూ 20 ఏళ్లుగా ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంతో మంది ప్రయత్నించినప్పటికీ ఇంతకాలానికి రూ. 2 కోట్లతో ఆరు నెలల్లోనే నిర్మాణం చేయగలిగామన్నారు. అయితే ఆలయానికి ఎన్టీఆర్ విగ్రహం అడ్డుగా ఉండడంతో పక్కకు మాత్రమే జరిపేందుకు ప్రయత్నించారని, దీనిని రాజకీయం చేయాలని టీడీపీ చూసిందని మండిపడ్డారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన నాయకులే ఆయన పట్ల కపటప్రేమ చూపిస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరించారంటూ విమర్శించారు. ఇటువంటి వ్యవహార శైలిపై హిందూ సంస్థలు స్పందించాలని పిలుపునిచ్చారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వారి పేర్లతో సహా పక్కకు మార్పు చేస్తున్నామని, దీనిని కూడా స్వార్థం కోసం వినియోగించుకుంటూ వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని యథాతథంగా ఉంచామని, ఇలాంటి రాజకీయాలు చేస్తే తాము తగిన రీతిలో స్పందించాల్సి వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ఆడేద్దాం.. ఆనందంగా..

- పల్లెల్లో క్రీడా సందడి
- 'ఆడుదాం ఆంధ్ర'లో ఉత్సాహంగా యువత



గంగనాపల్లిలో క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న గీసాల శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ రూరల్: పల్లెలకు క్రీడా సంక్రాంతి వచ్చింది.. యువతలో ఆనందం ఉరకలేస్తోంది.. ప్రతిభను చాటే వేదిక 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.. గ్రామ సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 47 రోజుల పాటు కొనసాగనున్న క్రీడా పోటీలను ఉత్సాహంగా జరుపుతోంది. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్ క్రీడల్లో తమ సత్తా చాటేందుకు పల్లెల్లో జట్టు కడుతున్న యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ తమ ప్రాంతానికి విజయం తీసుకురావాలని పట్టుదలతో ఆడుతున్నారు. మరోవైపు వైఎస్సార్ సీపీ నేతలు గ్రామాల్లో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం సమకూర్చిన క్రీడా కిట్లను క్రీడాకారులకు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం గంగనాపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు తదితరులు క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేసి, క్రికెట్ మ్యాచ్‌ను తిలకించి గ్రామంలోని యువతను ఉత్సాహపరిచారు. అన్ని గ్రామాల్లో సచివాలయాల వారీగా పోటీలు జరుగుతుండగా ఆయా ప్రాంత నేతలు యువతీ, యువకులు పాల్గొంటున్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనే వారు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇంకా ఎవరైనా ఉత్సాహవంతులు ఉంటే వారి కోసం స్పాట్ రిజిస్ట్రేషన్ చేపడుతున్నారు. పోటీలను మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఉత్కంఠగా క్రీడా పోటీలు

కరప: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు కరప మండలంలో నాలుగో రోజు శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగాయి. గురజనాపల్లి, పెద్దాపురప్పాడు, వేళంగి, నడకుదురు, కరప, వేములవాడ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ మ్యాచ్‌లు జరిగాయి. ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ కె.అప్పారావు పర్యటించి క్రీడా పోటీలను పరిశీలించారు. నాలుగోరోజు 33 మ్యాచ్‌లు జరిగాయని ఎంపీడీఓ తెలిపారు. ఇందులో కబడ్డీ 9, క్రికెట్ 15, బ్యాడ్మింటన్ 7, వాలీబాల్ 2 మ్యాచ్‌లు జరిగాయన్నారు. ఆయా పాఠశాలల్లో పీడీలు ఆటల పోటీలను నిర్వహించారు.



కరపలో వాలీబాల్ క్రీడాకారులకు నిబంధనలు వివరిస్తున్న పీడీ శ్రీనివాస్



గంగనాపల్లిలో క్రికెట్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పర్యావరణాన్ని పరిరక్షించండి



స్రవంతికి మొక్కను అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. స్రవంతి మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ బాగా పెరిగిపోయిందని, పచ్చదనం పెంచడంతోనే నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. శ్రీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, గీతం పబ్లిక్ స్కూల్, దుర్గాప్రసాద్, సామా పబ్లిక్ స్కూళ్లను సందర్శించి విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. పచ్చదనం పెంపునకు పలు సూచనలు చేశారు. డీఈఓ నాగమణి, అర్బన్ డీఐ వాణికుమారి, నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో వస్తువులు కొనుగోలు చేస్తున్న సందర్శకులు

బోట్‌క్లబ్: కళాకారులు తయారు చేసిన కళాత్మక వస్తువులను కొనుగోలు చేసి చేనేత వస్త్రాలు, హస్తకళలను ప్రోత్సహించాలని ప్రదర్శన మేనేజర్ ఖైజర్ అన్నారు. కాకినాడ సర్పవరం జంక్షన్ సమీపంలోని ఎస్ఆర్ఎంటీ మాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో కళాకారులచే రూపొందించిన కలంకారీ శారీస్, బెంగాలీ కాటన్ శారీస్, కలంకారీ వస్త్రాలు, బ్యాంగిల్స్, కలంకారి డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ షర్టులు, జైపూర్ బెడ్ షీట్స్, పానిపట్ సోఫా కవర్స్, మైసూర్ పెయింటింగ్స్, టెర్రాకోట ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, 1 గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్స్, ఢిల్లీ రెడీమేడ్ గార్మెంట్స్, లేడీస్ చెప్పల్స్, బెంగాలీ శారీస్, సహరాన్‌పూర్ ఫర్నీచర్, లేడీస్ టాప్స్– స్కర్ట్స్, హైదరాబాద్ పెరల్స్–శారీస్, ఫిరోజాబాద్ గ్లాస్– గిఫ్ట్ ఐటమ్స్ లభిస్తాయని తెలిపారు. ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్వహిస్తున్నామని, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులకు చేయూతనివ్వాలన్నారు. సుమారు 30 వేల రకాల ఐటమ్స్ ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రదర్శన ఉంటుందన్నారు.

ఫౌంటైన్లపై నిర్లక్ష్యపు జల్లు!

- నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగం
- విద్యాలయాల్లో కళాహీనంగా మారిన వైనం
- చక్కదిద్దుతామంటున్న అధికారులు



జేఎన్‌టీయూకే ఆవరణలో సివిల్ విభాగం ఎదుట ఉన్న వాటర్ ఫౌంటైన్

బాలాజీచెరువు: స్మార్ట్ సిటీగా కాకినాడ నగరం రూపుదిద్దుకుంటోంది. ఓవైపు కోట్ల రూపాయలు వెచ్చించి పార్కులు, ముఖ్య కూడళ్లలో సుందరీకరణ కోసం ఫౌంటైన్లు ఏర్పాటు చేస్తోంది. కానీ, ప్రస్తుతం ఉన్నవాటిని మాత్రం వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యానికి గురిచేయడం నగర ప్రజానీకాన్ని విస్మయానికి గురిచేస్తోంది. నగరంలో ఉన్న విద్యాలయాల్లో ప్రవేశ ద్వారాలు లక్షల రూపాయలు వెచ్చించి ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆర్చిలు నిర్మించి, వాటి లోపల ఉన్న వాటర్ ఫౌంటేన్లను నిరుపయోగంగా విడిచిపెడుతుండడంతో అవి కళాహీనంగా మారుతున్నాయి.

విద్యాలయాల సుందరీకరణ పనుల్లో భాగంగా కాకినాడ జేఎన్‌టీయూ, ప్రభుత్వ ఐటీఐ వంటి కళాశాలల్లో వాటర్ ఫౌంటైన్లను నెలకొల్పారు. వీటి చుట్టూ రంగురంగుల డిజిటల్ లైటింగ్‌తో పాటు, పచ్చని మొక్కలు, టైల్స్, అత్యాధునిక హంగులు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో ఆహ్లాదం కోసం ఫౌంటైన్ గట్టుపై కూర్చునే విధంగా తీర్చిదిద్దారు. కొన్నాళ్ల పాటు ఆహ్లాదం కల్పించిన ఈ ఫౌంటేన్లు నేడు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిపై వెచ్చించిన లక్షల రూపాయల పరిస్థితి బూడిదలో పోసిన పన్నీరులా మారింది. దాదాపు 45 గజాల విస్తీర్ణంలో డైమండ్ ఆకారంలో నిర్మించిన ఈ ఫౌంటైన్లు నేడు కళాహీనంగా మారడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. వీటి చుట్టూ ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ పాడైపోవడంతో పాటు, వర్షాకాలంలో వీటిలోకి చేరిన నీరు నాచుకట్టి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో విద్యార్థులు వాటి దరిదాపులకు వెళ్లడానికి సాహసించడం లేదు. అధికారులు ఇప్పటికైనా వీటిపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

వాటర్ ఫౌంటైన్ల నిర్వహణ సక్రమంగా చేయకపోవడం వల్ల నిరుపయోగంగా మారాయి. వాటిని తిరిగి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా వేసవి కాలంలో వీటిని వినియోగించడం వల్ల ఈ ప్రాంతంలో కాస్త విశ్రమించడానికి వీలు కలుగుతుంది.
– డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూకే

గ్రామాభివృద్ధి ప్రణాళికపై దృష్టి సారించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, కార్యదర్శులు

కరప: పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ సూచనల మేరకు కార్యదర్శులు తమ పరిధిలో గ్రామాభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపకల్పనపై దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించడంలో అనుసరించాల్సిన విధి, విధానాలపై పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ సుధాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావుతో కలసి ఆయన పాల్గొన్నారు. తర్వాత ఎంపీడీఓ కార్యదర్శులకు సూచనలు చేశారు. నిర్దేశించిన 9 రకాల ఇతివృత్తాలలో ఒకదానిని ఎంచుకుని పంచాయతీ సమావేశంలో తీర్మానం చేసి, దానికనుగుణంగా బడ్జెట్‌ను సమీకరించుకోవాలన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీకి పదోన్నతి

కాకినాడ క్రైం: స్థానిక ట్రాఫిక్ డీఎస్పీ మొగిలి వెంకటేశ్వరరావుకి పదోన్నతి లభించింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) గుంటూరు అదనపు ఎస్పీగా ఆయన నియమితులయ్యారు. ఆయనది 1989 ఎస్సై బ్యాచ్. డీఎస్పీగా పదోన్నతి అనంతరం ఉమ్మడి జిల్లాలో స్పెషల్ బ్రాంచ్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పని చేశారు.